ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 135 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | శుక్రవారం 20 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

## ..ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర దిశగా కదలనుంది.





**విశాఖ, ఢిల్లీ, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర దిశగా కదలనుంది. క్రమంగా ఈ అల్పపీడనం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. తర్వాత 24 గంటల పాటు వాయుగుండం తీవ్రత కొనసాగనుంది. అల్పపీడన ప్రభావంతో ఏపీ, ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో చాలా చోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. తీరం వెంట గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వర్షం కురుస్తోంది. విశాఖలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. దీంతో గోపాలపట్నం ఇందిరానగర్లో ప్రహరీ కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. జీవీఎంసీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన తొలగింపు పనులు చేపట్టింది.

# అమరావతికి రుణం

## ..ప్రపంచబ్యాంకు ఆమోదం!

**ఢిల్లీ, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):**

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. గురువారం ప్రపంచ బ్యాంకు బోర్డు సమావేశం జరిగింది.

**అమరావతికి 800 మిలియన్ డాలర్ల రుణం**



ఇచ్చేందుకు ఈ భేటీలో ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ఏపీ రాజధానికి ఇప్పటికే 788 మిలియన్ డాలర్ల రుణాన్ని ఏడీబీ మంజూరు చేసింది.అమరావతి నిర్మాణానికి నిధులు ఇస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రకటన చేసింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల ద్వారా నిధులు సమకూరుస్తామని చెప్పింది. ఈ 2 సంస్థల ద్వారా 1588 మిలియన్ డాలర్ల నిధులు సమకూర్చుతామని పేర్కొంది. ఈ నేపథ్యంలో రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలిపినట్లు సమాచారం.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో పర్యటించారు.



**పెనమలూరు, ఢిల్లీ, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో పర్యటించారు. గంగూరు, ఈడ్పుగల్లు గ్రామాలకు ఆయన వెళ్లారు. గంగూరు రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది, రైతులు, అధికారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

# వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది.



**ఢిల్లీ, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మరియమ్మ హత్య కేసులో ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. నందిగం సురేష్ పిటిషన్ ను జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ ప్రశాంత్ కుమార్ ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను జనవరి 7కు వాయిదా వేసింది.

# వైకాపాకు విశాఖ డెయిరీ

## చైర్మన్, డైరెక్టర్లు రాజీనామా

వైకాపాకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ తో పాటు డైరెక్టర్లు రాజీనామా చేశారు.



**విశాఖపట్నం,డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా కు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్కుమార్ పాటు డైరెక్టర్లు రాజీనామా చేశారు. ఆనంద్ తన రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్కు పంపారు. గత కొన్ని రోజులుగా పార్టీ కార్యకలాపాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో వైకాపా ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేశారు.పార్టీకి రాజీనామా చేసిన వారిలో విశాఖ డెయిరీ డైరెక్టర్లు శరగడం వరాహ వెంకట శంకర్రావు, పిల్లా రమా కుమారి, శీరంరెడ్డి సూర్యనారాయణ, కోళ్ల కాటమయ్య, దాడి పవన్ కుమార్, ఆరంగి రమణబాబు, చిటికెల రాజకుమారి, రెడ్డి రామకృష్ణ, సుందరపు ఈశ్వర్, పరదేశి గంగాధర్ ఉన్నారు. వీరంతా వైకాపా కేంద్ర కార్యాలయానికి తమ రాజీనామా లేఖలను పంపించారు.

# జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?: మంత్రి సీతక్క

పార్లమెంటులో అంబేడ్కర్ను, అసెంబ్లీలో దళిత స్పీకర్ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు.



**హైదరాబాద్, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** పార్లమెంటులో అంబేద్కర్ను, అసెంబ్లీలో దళిత స్పీకర్ను అవమానించారని మంత్రిసీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్చాట్ లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు. "జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే" .


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# నవజీవన్ బధిర బాలలకు

## నిత్యావసర వస్తువుల కిట్ల పంపిణీ



నవజీవన్ బధిర బాలలకు నిత్యావసర కిట్లు పంపిణి చేసిన నంద్యాల ఐఎంఏ వైద్యులు

**నంద్యాల ,డిసెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ బధిరుల పాఠశాలలో 150 మంది బాలలకు నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేయడం జరిగింది.నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ జి. రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కల్పన, ఆర్.ఆర్.ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రవికాంత్ రెడ్డి, సిసింద్రీ ఆసుపత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ వకుళ క్రాంతి ల సౌజన్యంతో నిత్యావసర కిట్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం, ఐఎంఏ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నంద్యాల పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రత్యేక పాఠశాలలకు సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. పాఠశాలలో ఉన్న బధిర బాలలందరికీ ఐఎంఏ హెల్త్ కార్డులను పంపిణీ చేస్తామని, తద్వారా వారు ఉచిత ఓపిడి సేవలు నంద్యాలలో పొందవచ్చని అన్నారు. ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద, అధ్యక్షురాలు డాక్టర్ కల్పన మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యుల విభాగం ఆధ్వర్యంలో త్వరలో నవజీవన్ పాఠశాలకు అవసరమైన క్రీడా పరికరాలు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్పన,డాక్టర్ నర్మద, డాక్టర్ అనూష, డాక్టర్ మధుసూదన రెడ్డి ,డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి,నవజీవన్ పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, సిస్టర్ శిరీష, అడ్మినిస్ట్రేటర్ రాజశేఖర్ , అధ్యాపక బృందం పాల్గొన్నారు.ఈ సందర్భంగా బధిర బాలలు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. వినికిడి లేకపోయినప్పటికీ, సంగీతానికి, పాటలో ఉన్న భావానికి అనుగుణంగా డాన్స్ మాస్టర్ సైగలతో ఇచ్చే సూచనలకు చక్కటి నృత్యాన్ని ప్రదర్శించారు.డాక్టర్ కల్పన, డాక్టర్ నర్మద, డాక్టర్ అనూష, డాక్టర్ మధుసూదన రెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి లను డాక్టర్ రవి కృష్ణ నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

# పోలీస్ ఉద్యోగ నియామక దేహదారుడ్య పరీక్షలకు ఉచిత శిక్షణ ఆత్మకూరు పోలీసులు



**నంద్యాల క్రైం, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పరిధిలోని ఆత్మకూరు సబ్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో పోలీస్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించి దేహదారుఢ్య పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులకు జిల్లా పోలీస్ అధికారుల సూచనలతో ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్, ఆత్మకూరు టౌన్ ఇన్స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ నందు ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డీఎస్పీ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేహదారుఢ్య పరీక్షలకు ఆత్మకూరు గవర్నమెంట్ కళాశాల మైదానం నందు ఉన్నటువంటి మొక్కలను డోజర్ సహాయంతో క్లీన్ చేయించి, రోడ్ రోలర్ తో 100 మీటర్స్ లైన్స్ ,లాంగ్ జంప్, 1600 మీటర్స్ గ్రౌండ్ నందు గుంతలు లేకుండా చదును చేసి శుభ్రపరచడం జరిగింది. అనంతరం ఫిజికల్ టెస్ట్ కు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. నేడు 31 మంది మగవారు 6 మంది ఆడవారు మొత్తం 41 మంది అభ్యర్థులు హాజరవ్వడం జరిగింది. పై ఫిజికల్ ట్రైనింగ్ శిక్షణ ఇచ్చుటకు దేవానంద్, శంకర్ అనే ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ ఉచిత శిక్షణ తరగతులను గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉండే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పోలీసు అధికారులు తెలియజేయడమైనది.

# పోలీసుల విచారణకు హాజరైన వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన వైకాపా నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు.



**టెక్కలి , డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన వైకాపా నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. వైకాపా అధికారంలో ఉండగా తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారంటూ నవంబర్ 18న టెక్కలి జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కణితి కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈనెల 13న దువ్వాడ శ్రీనివాసు 41ఏ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో దువ్వాడ పోలీసుల విచారణకు హాజ-రయ్యారు.

# తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించం : బీఆర్ నాయుడు

తిరుమల ప్రశాంతతను దెబ్బతీసేలా కొండపై ఎవరు రాజకీయ వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు.



**తిరుపతి, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** తిరుమల ప్రశాంతతను దెబ్బతీసేలా కొండపై ఎవరు రాజకీయ వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "తిరుమల పవిత్ర క్షేత్రం. ఇది రాజకీయ వేదిక కాదు. ఎవరు రాజకీయంగా తిరుమలను వేదికగా చేసుకున్నా చర్యలు తప్పవని గతంలోనే హెచ్చరించాం. తిరుమల పవిత్రతను కాపాడే విషయంలో వెనుకడుగు వేయకూడదనే మా పాలకమండలి తొలి సమావేశంలోనే ప్రత్యేక ఎజెండాగా ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకున్నాం. కొండపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదు. ఇటీవల తెలంగాణకు చెందిన ఒక నేత తిరుమల వేదికగా రాజకీయ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. అతనిపై చర్యలకు ఆదేశిస్తున్నాం" అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

# పార్శిల్లో మృతదేహం

## ..పశ్చిమగోదావరి జిల్లాలో విస్తుగొలిపే ఘటన

పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో విస్తుగొలిపే ఘటన చోటుచేసుకుంది. పార్శిల్లో గుర్తుతెలియని మృతదేహం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.



**ఉండి, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో విస్తుగొలిపే ఘటన చోటుచేసుకుంది. పార్శిల్లో గుర్తుతెలియని మృతదేహం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. జిల్లా ఎస్పీ నయీం అస్మి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.సాగి తులసి అనే మహిళకు యండగండి గ్రామంలో ప్రభుత్వం నుంచి స్థలం మంజూరు కాగా ఇల్లు నిర్మిస్తోంది.. ప్రస్తుతం ఆ ఇల్లు ప్లాస్టింగ్ స్టేజ్లో ఉంది. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం కోసం క్షత్రియ సేవా సమితికి ఆమె దరఖాస్తు చేసుకుంది. మొదటి విడతలో సేవా సమితి టైల్స్ అందజేసింది. మరోసారి ఆర్థిక సాయం కోసం మహిళ దరఖాస్తు చేసుకోగా.. పార్శిల్లో విద్యుత్ సామగ్రికి బదులు మృతదేహం వచ్చింది. పార్శిల్లో ఒక ఉత్తరం కూడా ఉన్నట్లు గుర్తించారు. అందులో రూ.1.30 కోట్లు చెల్లించాలని, లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పార్శిల్ పెట్టెలో సుమారు 45 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం సగ భాగం ఉన్నట్లు గుర్తించారు.

# భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు : మంత్రి పొంగులేటి

గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.



**హైదరాబాద్, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. శాసనసభలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూ-సుకెళ్లేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి ఆందోళనల మధ్యే భూ భారతి బిల్లుపై పొంగులేటి తన ప్రసంగాన్ని కొనసాగించారు."భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్ కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్రవు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళ్లు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు" అని పొంగులేటి వ్యాఖ్యానించారు.హరీశ్రావుపై స్పీకర్ ఆగ్రహంఅంతకుముందు ప్రసాద్కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. "హరీశ్రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా? "అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏసీబీ కేసు

## ..హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



**హైదరాబాద్, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నత న్యాయస్థానంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. భోజన విరామం తర్వాత దీనిపై విచారణ చేపట్టాలని ఆయన కోరారు.భారాస హయాంలో పురపాలకశాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్ను ప్రధాన నిందితుడి (ఏ1)గా పేర్కొంటూ తెలంగాణ ఏసీబీ గురువారం కేసు నమోదు చేసింది. పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్కుమార్ (ఏ2), హెచ్ఎండీఏ అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్రెడ్డి(ఏ3) లనూ ఎఫ్ఐఆర్లో చేర్చింది.ఫార్ములా ఈ-రేసు నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీసంస్థకు సొమ్ము చెల్లించారంటూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఏసీబీకి ఈ ఏడాది అక్టోబరు 18న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కేటీఆర్ మంత్రిగా పనిచేసిన సమయంలో ఈ వ్యవహారం చోటుచేసుకోవడంతో కేసు నమోదుకు ప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరింది. ఇటీవల గవర్నర్ ఆమోదించడంతో ఈ నెల 17న సాధారణ పరిపాలనశాఖ మెమో జారీ చేయగా.. ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) డీఎస్పీ మాజిద్ అలీఖాన్ గురువారం కేసు నమోదు చేశారు.

# ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస పట్టు

## .. శాసనసభలో తీవ్ర గందరగోళం

తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ-రేసు పై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు.



**హైదరాబాద్, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ- రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడింది.దీంతో స్పీకర్ ప్రసాద్కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో ఏ-1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శా-సనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని భారాస సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ-రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది.అంతకుముందు భారాస ఎమ్మెల్యే హరీశ్రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు. కేటీఆర్ను అప్రతిష్ఠ పాల్జేసి భారాసను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఈ అంశంపై రకరకాల లీకులు ఇస్తున్నారు. మేం ఎలాంటి తప్పు చేయలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ- రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తాం"అని హరీశ్రావు అన్నారు.

# గచ్చిబౌలిలో 'మార్గదర్శి' 121వ శాఖ ప్రారంభం




**హైదరాబాద్, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని గచ్చిబౌలిలో 'మార్గదర్శి' చిట్ఫండ్ 121వ శాఖ ప్రారంభమైంది. రామోజీగ్రూపు సీఎండీ సీహెచ్ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ దీన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ విజయేశ్వరి, సుజయ్, ఈనాడు ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ ఎం. నాగేశ్వరరావు, తెలంగాణ ఎడిటర్ డీఎన్ ప్రసాద్, ఈటీవీ సీఈవో బాపినీడు, మార్గదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్ ప్రతి అక్షరం ప్రజల కోసం స్పెషల్




# పవన్ కళ్యాణ్ .. అద్భుతమైన వ్యక్తి: శ్రియారెడ్డి

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ పై ప్రశంసల వర్షం కురిపించారు నటి శ్రియా రెడ్డి పవన్ కల్యాణ్ ఒక అద్భుతమైన వ్యక్తి అన్నారు.

'సలార్' తో గతేడాది ప్రేక్షకులను అలరించారు నటి శ్రియా రెడ్డి ప్రస్తుతం ఆమె పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తోన్న 'ఓజీ' కోసం వర్క్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియా రెడ్డి.. తాను నటిస్తోన్న సినిమాల గురించి మాట్లాడారు. ముఖ్యంగా పవన్కల్యాణ్ 'ఓజీ' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు."గడిచిన ఈ ఏడాది కాలం నాకు ఎంతో ప్రత్యేకం. గతేడాది చివర్లో విడుదలైన 'సలార్ సీజ్ఫైర్'లో నా పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అందులో నేను ఖాన్సార్ సామ్రాజ్యంలో ఆధిపత్యం వహించేవిధంగా కీలక పాత్ర పోషించా. ఈ ఏడాది విడుదలైన 'తలైమై సేయలగం'లో రాజకీయ నాయకురాలి రోల్ చేశా. తెలుగు చిత్ర పరిశ్రమలో రానున్న బిగ్గెస్ట్ మూవీల్లో ఒకటైన 'ఓజీ'లో వర్క్ చేశా. ఈ ఏడాదికాలంలో నన్ను నేను పునర్నిర్మించుకున్నా. ప్రస్తుతానికి నా చేతిలో కేవలం 'ఓజీ' మాత్రమే ఉంది. కొన్ని చిత్రాలు ఇంకా చర్చల దశలో ఉన్నాయి. ఇందులో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది. 'సలార్' లోని రాధారమ పాత్రకు, ఈ సినిమాలోని పాత్రకు ఎలాంటి సంబంధం ఉండదు. రెండు పాత్రల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. స్క్రీన్పై నన్ను చూసి ప్రేక్షకులు తప్పకుండా ఆశ్చర్యపోతారు" అని తెలిపారు.అనంతరం ఆమె పవన్కల్యాణ్ వర్క్ చేయడంపై మాట్లాడుతూ.. " పవన్కల్యాణ్ కాంబినేషన్లో ఇప్పటికే కొన్ని సన్నివేశాలు చేశా. ఆయన చాలా తెలివైన, మర్యాద గల వ్యక్తి. ఎంతో హుందాగా ఉంటారు. ఆయనొక అద్భుతమైన వ్యక్తి. ఎదుటి వ్యక్తులతో ఆయన ప్రవర్తన, మాట్లాడే విధానం చూడచక్కగా ఉంటుంది" అని ఆమె చెప్పారు. పవన్కల్యాణ్ హీరోగా సుజిత్ తెరకెక్కిస్తోన్న చిత్రమే 'ఓజీ'. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై దానయ్య దీనిని నిర్మిస్తున్నారు. ప్రియాంకమోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. 2006లో విడుదలైన 'పొగరు'తో శ్రియారెడ్డి తెలుగు వారికి చేరువయ్యారు. ఇందులో ఆమె నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించారు.



# ఆ సినిమా పరాజయం.. నాకంటే వాళ్లెంతో బాధ పడ్డారు :మోహన్ లాల్



మలయాళ నటుడు మోహన్లాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బరోజ్ 3డీ'. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈనేపథ్యంలోనే ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తన కథల ఎంపిక గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన గత చిత్రం 'మలైకోట్టై వాలిబన్' పరాజయం తనని ఎంతో బాధించిందన్నారు. ఆ సినిమాపై తాను ఎన్నో ఆశలు పెట్టుకున్నానని తెలిపారు."ఎన్నో కథలు వింటుంటా. అందులో నా మనసుకు చేరువైన కథలను ఎంచుకుంటా. నా గత చిత్రం 'మలైకోట్టై వాలిబన్' కథను ఎంతగానో నమ్మా. భారీ బడ్జెట్తో దానిని రూపొందించాం. ఆ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా. తీరాచూస్తే.. ఆ సినిమా ప్రేక్షకులను అలరించలేకపోయింది. అందువల్ల నేను నిరాశకు గురయ్యా. ఆ సినిమా ఫలితం విషయంలో నాకంటే ఎక్కువగా నా అభిమానులు బాధ పడ్డారు. సినిమా ఏదైనా పరాజయం అందుకుంటే దాని పూర్తి బాధ్యత నటుడిపై వేసేస్తారు. అతడినే తప్పుబడతారు. అదొక సవాలు. ఎందుకంటే కథల ఎంపికలో ఎంతో శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. కొత్త దర్శకులు ఎవరైనా కథలు చెప్పడానికి నన్ను సంప్రదించినప్పుడు.. వారిలో నన్ను నేను చూసుకుంటుంటా. విభిన్నమైన కథలు చెప్పాలనే వారి తపన నాకు అర్థం అవుతుంది" అని మోహన్లాల్ తెలిపారు.మోహన్లాల్ నటించిన తాజా చిత్రం 'బరోజ్ 3డీ'. జీజో పున్నూసే రచించిన 'బరోజ్: గార్డియన్ ఆఫ్ డి గామాస్ ట్రెజర్ నవలను ఆధారంగా చేసుకొని దీనిని రూపొందించారు. మోహన్లాల్ ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. వాస్కో డి గామాలో దాగి ఉన్న రహస్య నిధిని 400 ఏళ్లుగా కాపాడుతూ వచ్చే సంరక్షకుడు బరోజ్. ఆ సంపదను దాని నిజమైన వారసుడికి అందించడానికి బరోజ్ ఏం చేశాడు? అనే అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ ఎపిక్ డ్రామా ఫాంటసీ సినిమాని ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

## ఐశ్వర్య కుమార్తె - షారుక్ తనయుడి స్టేజ్ షో.. వీడియో వైరల్

తమ పిల్లల స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో బాలీవుడ్ తారలు సందడి చేశారు. దీనికి సంబంధించిన పలు వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారాయి.




బాలీవుడ్ సెలబ్రిటీలు షారుక్ ఖాన్ ఐశ్వర్య రాయ్ సైఫ్ అలీఖాన్ ఒకేచోట సందడి చేశారు. తమ పిల్లల స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొని వారిని ప్రోత్సహించారు. అలాగే, పిల్లల ప్రదర్శనలు చూసి మురిసిపోయారు.ఇదీ చదవండి: రివ్యూ: బచ్చలమల్లి.. ముంబయిలోని ధీరూబాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్లో బాలీవుడ్లోని చాలామంది సెలబ్రిటీల పిల్లలు చదువుకుంటోన్న విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం ఆ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆరాధ్య కోసం అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్ కలిసివచ్చారు. తమ చిన్న తనయుడు అబ్రం కోసం షారుక్ ఖాన్ కుటుంబం ఇక్కడ సందడి చేసింది. ఐశ్వర్య కుమార్తె ఆరాధ్య, షారుక్ ఖాన్ తనయుడు అబ్రం కలిసి స్టేజ్ షో చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ మారాయి. కుమారుడిని చూసి షారుక్ పుత్రోత్సాహానికి గురయ్యారు. అబ్రం ప్రదర్శన ఇస్తోన్న సమయంలో ఆ విజువల్స్ను కెమెరాలో బంధించారు. ఐశ్వర్య అభిషేక్ కూడా తమ కుమార్తె ప్రదర్శనను కెమెరాలో రికార్డు చేస్తూ కనిపించారు. ప్రదర్శన అనంతరం పిల్లలతో కలిసి వీరందరూ డ్యాన్స్ చేశారు.అమితాబ్ బచ్చన్ ఆయన తనయుడు అభిషేక్ బచ్చన్, కోడలు ఐశ్వర్యరాయ్ చాలా రోజుల తర్వాత ఒక ఈవెంట్లో కలిసి కనిపించారు. ఇటీవల కాలంలో అమితాబ్ బచ్చన్ కుటుంబసభ్యులందరూ ఏదైనా కార్యక్రమానికి హాజరైనా కలిసి మాత్రం ఫొటోలు దిగడం లేదు. అమితాబ్ బచ్చన్ ఫ్యామిలీ అంతా ఒకసారి ఫొటోలు దిగుతుండగా.. ఐశ్వర్యరాయ్, ఆమె కుమార్తె ఆరాధ్య విడిగా కెమెరా ముందుకువస్తున్నారు. ఫ్యాషన్ షోలకు కూడా ఐశ్వర్యరాయ్ తన భర్తతో కాకుండా కుమార్తెతో హాజరవుతున్నారు. ఈక్రమంలోనే ఎన్నో వదంతులు తెరపైకి వచ్చాయి. ఆ వార్తలను ఉద్దేశించి అమితాబ్ పరోక్షంగా స్పందించారు. నిజానిజాలు తెలుసుకోకుండా కొంతమంది ఇలాంటి ప్రచారాలు సృష్టిస్తుంటారని అన్నారు. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన స్కూల్ ఈవెంట్లో ఈ ముగ్గురూ కలిసి కనిపించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1934: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఈడుపుగంటి వెంకట సుబ్బారావు జననం (మ.2010).(చిత్రంలో)
- 1942: కోల్కతా పై మొదటిసారి జపాన్ వైమానికదాడి చేసింది.
- 1988: ఓటు వేసే కనీస వయసును 21 నుండి 18కి తగ్గిస్తూ చేసిన 62వ రాజ్యాంగ సవరణ పార్లమెంటు ఆమోదం పొందింది.
- 1990: అమెరికన్ పాప్ గాయని, గీత రచయిత జోజో జననం.
- 1996: అమెరికన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు, ఖగోళ భౌతిక శాస్త్రజ్ఞుడు, రచయిత, కాస్మోలజిస్ట్ కార్ల్ సాగాన్ మరణం (జ.1934).
- 2012: భారత హాకీ క్రీడాకారుడు లెస్లీ క్లాడియస్ మరణం (జ.1927).



వెంకట సుబ్బారావు




జపాన్



పార్లమెంటు ఆమోదం



జోజో



కార్ల్ సాగాన్



లెస్లీ క్లాడియస్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS


# పృథ్వీ షా ఉన్నా లేనట్లే .. 10 మంది ఫీల్డర్లతో ఆడాం'

పృథ్వీ షా ను విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్లకు ఎంపిక చేయకపోవడంపై ముంబయి క్రికెట్ అసోసియేషన్ స్పందించింది.



పృథ్వీ షా ను విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్లకు ఎంపిక చేయకపోవడంపై ముంబయి క్రికెట్ అసోసియేషన్ స్పందించింది. అతని ఫిట్నెస్, క్రమశిక్షణ, ప్రవర్తన బాగా లేకపోవడమే ఇందుకు కారణమని ఎంసీఏ అధికారి ఒకరు తెలిపారు. 'ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీట్రోఫీలో 10 మంది ఫీల్డర్లతో ఆడాం. పృథ్వీ షా మైదానంలో ఉన్నా లేనట్లే. బంతి అతని పక్కనుంచి వెళ్లినా దాన్ని పట్టుకోలేదు. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా సరైన సమయంలో బంతిని హిట్ చేయడంలో ఇబ్బందిపడటం చూశాం. అతని ఫిట్నెస్, క్రమశిక్షణ, ప్రవర్తన కూడా బాగా లేవు. టీమ్లోని సీనియర్లు కూడా ఇప్పుడు అతని వైఖరిపై ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులు పెడితే అవి ముంబయి సెలక్టర్లు, ఎంసీఏపై ప్రభావం చూపిస్తాయని అనుకోవడం తప్పు. పృథ్వీ షా ఫిట్నెస్ విషయంలో జాగ్రత్తగా ఉండటం లేదు. పృథ్వీకి శత్రువులెవరూ లేరు. తనకి తానే శత్రువు' అని ఎంసీఏ అధికారి పేర్కొన్నారు.విజయ్ హజారే ట్రోఫీ విషయంలో భంగపాటు ఎదురవడంతో పృథ్వీ షా ఇన్స్టా స్టోరీలో ఓ పోస్టు పెట్టాడు. "చెప్పు దేవుడా.. నేనింకా ఏమేం చూడాలి? విజయ్ హజారే ట్రోఫీలో 65 ఇన్నింగ్స్లో 55.7 సగటు, 126 స్ట్రైక్ రేటుతో 3,399 పరుగులు చేసినా టోర్నీ ఆడేందుకు అర్హుడిని కానా? అయినా నీపై నా నమ్మకాన్ని వీడను. ఇప్పటికీ ప్రజలు నాపై విశ్వాసంతో ఉన్నారని భావిస్తున్నా. కచ్చితంగా తిరిగొస్తా. ఓం సాయిరాం" అని ఆ పోస్టులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే ఎంసీఎ వర్గాలు తాజాగా స్పందించాయి.ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబయి ఛాంపియన్గా నిలిచింది. అయితే, పృథ్వీ షా అందులో పెద్దగా రాణించలేదు. 9 మ్యాచ్లో 197 పరుగులు మాత్రమే చేశాడు. మధ్యప్రదేశ్తో జరిగిన ఫైనల్లో 10 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో విజయ్ హజారే ట్రోఫీకి అతడిని ఎంపిక చేయ-ఎలేదు. ఫిట్నెస్, క్రమశిక్షణ కారణాలతో రంజీ ట్రోఫీ లీగ్ దశ మధ్యలోనే పృథ్వీని జట్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. నవంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో పృథ్వీని ఏ ఫ్రాంఛైజీ కొనుగోలు చేయకపోవడంతో అన్సోల్డ్గా మిగిలాడు.

## అంధం




లిప్ ఆయిల్స్ అనేవి లేటెస్ట్గా మార్కెట్లోకి అడుగుపెట్టినవి. ఇవి లిప్గ్లాస్కి దగ్గరగా ఉంటాయి. అయితే వీటిని వాడేటప్పుడు మరింత గ్లాసీ లుక్ ఇవ్వడమే కాకుండా స్టికీగా అనిపించవు. దీనిలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో పెదాలు హైడ్రేట్ అవుతాయి. చూడ్డానికి పెదాలు చక్కగా, అందంగా కనిపిస్తాయి. ఇవి స్కిన్కేర్లో కచ్చితంగా యాడ్ చేసుకోవాలి. మరీ ముఖ్యంగా చలికాలంలో. వీటిని వాడడం వల్ల పెదాలపై ఓ లేయర్ ప్రొటెక్షన్ ఏర్పడుతుంది. దీంతో చలికి ఏ మాత్రం పగలవు. వీటిని రాయడం వల్ల పెదాలు మరింత అందంగా, హెల్దీగా మారతాయి.

# పెదాలు పగులుతున్నాయా

## ..లిప్బామ్ బదులు ఈ ఆయిల్ రాస్తే అందమైన పెదాలు మీ సొంతం

### ఎలా ఉంటాయి..



ఇవి చూడ్డానికీ గ్లాసీ లుక్తో ఉంటాయి. వీటిని మనం లిప్స్టిక్ వేశాకైనా వేసుకోవచ్చు. లేదా అలా అయినా వాడొచ్చు. లిప్స్టిక్ వేసి వాడినప్పుడు ఎక్స్ట్రా షైనీగా ఉంటాయి. దీంతో పర్ఫెక్ట్ గ్లాసీ, హెల్దీ లుక్ మీ సొంతమవుతుంది. ఇవి లిప్స్టిక్ వేసుకోకుండా నార్మల్గా వేసుకున్నా పెదాలు అందంగా కనిపిస్తాయి.

### హైడ్రేషన్..



ఈ లిప్ ఆయిల్ లిప్ బామ్ కంటే ఎక్కువగా హైడ్రేషన్ అందిస్తాయి. ఇందులో ఎక్కువగా విటమిన్స్, ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. దీంతో పెదాలు కోమలంగా మారి పగలడం జరగదు. చలికి ఎక్కువగా పెదాలు పగిలేవారు.. ఈ ఆయిల్స్ రెగ్యులర్గా వాడితే సమస్య తగ్గుతుంది.




### నాన్స్టికీ షైన్..



ఈ లిప్ ఆయిల్స్ వాడడం వల్ల గ్లాసీ స్టికీనెస్ లేకుండానే పెదాలు అందంగా మెరుస్తాయి. వీటిని వాడడం వల్ల పెదాల నేచురల్ రంగు షేప్ పెరుగుతుంది. చూడ్డానికి పెదాలు అందంగా కనిపిస్తాయి. యవ్వనంగా ఉంటాయి.

### ఎలాంటివి తీసుకోవచ్చు..



లిప్ ఆయిల్స్లోనూ కొన్ని రకాలు ఉంటాయి. అవేంటంటే.. ఉన్నవి.. ఇవి ప్రమాదకరమైన యూవీ కిరణాల నుంచి పెదాలని రక్షిస్తాయి. అదే విధంగా హైలురోనిక్ యాసిడ్ ఉంటే లిప్ ఆయిల్ వాడితే పెదాలు ప్లంపీగా, స్మూతీగా ఉంటాయి.





### ఎప్పుడు వాడాలి..



వీటిని ఎప్పుడైనా వాడొచ్చు. అయితే, రాత్రుళ్లు పడుకునేటప్పుడు వాడితే పెదాలు మరింత ఆరోగ్యంగా, అందంగా మారతాయి. కాబట్టి, నైట్ టైమ్ రొటీన్లో కచ్చితంగా ఈ లిప్ ఆయిల్స్ని యాడ్ చేయడం మరవకండి. గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.